


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

EVENING EDITION

4PM

www.suryaa.com పేజీలు: 02


బంగారం ధర ₹62,830 10 GRMS 24 CARAT

వెండి ధర 1KG 77,500

సెన్సెక్స్ 71,656

నిఫ్టి 21,623

చికెన్ ధర 1KG ₹160

గుడ్ల ధరలు డజన్ ₹68



## దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

దేశవ్యాప్తంగా పలుచోట్ల (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) ఎన్ఐఏ సోదాలు నిర్వహిస్తోంది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్‌లో ఎన్ఐఏ తనిఖీలు చేపట్టింది. దేశవ్యాప్తంగా 32 చోట్ల ఎన్ఐఏ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. హర్యానాలో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ అనుచరులపై ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. సిద్ధూ మూసేవాలా హత్య కేసులో ప్రధాన నిందితులు, బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన షార్ప్ షూటర్లు అంకిత్ సెర్సా, ప్రియవ్రత్ ఫౌజీల కుటుంబ సభ్యులను విచారించేందుకు సోనిపట్ జిల్లాకి ఎన్ఐఏ అధికారులు వెళ్లారు.

## చైనా ఉత్పత్తులపై ట్యాక్స్



చైనా నుంచి వచ్చే వీల్ లోడర్స్, జిప్సమ్ టైల్స్, ఇండస్ట్రియల్ లేజర్ మెషినరీలపై భారత్ దిగుమతి నిరోధక (యాంటీ డంపింగ్) సుంకం విధించింది. ఈ ఉత్పత్తులు భారత్ మార్కెట్‌లో సాధారణ విలువ కంటే తక్కువ ధరకే దిగుమతి అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీనివల్ల స్థానిక వ్యాపారులు నష్టపోతున్నారని తేల్చారు. దీన్ని అరికట్టేందుకు ఐదేళ్ల కాలానికి ట్యాక్స్ విధించింది.

## పోస్టాఫీసులు అందించే అత్యుత్తమ పథకాలు ఇవే



కేంద్ర ప్రభుత్వ పథకాలు సైతం పోస్టాఫీసులు అందుబాటులో ఉన్నాయి. వాటిలో మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్, సుకన్య సమృద్ధి అకౌంట్, కిసాన్ వికాస్ పత్ర, సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం అకౌంట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్, మరియు ఇతర సేవింగ్స్ స్కీమ్స్ కూడా కేంద్రం తక్కువ ఇన్వెస్ట్‌మెంట్‌తో అధిక రాబడి అందించే స్మాల్ సేవింగ్ స్కీమ్‌లను అందుబాటులోకి ప్రవేశపెట్టింది.

## అత్యాచార కేసులో సందీప్ లామిచానేకు 8 ఏళ్ల జైలు శిక్ష



అత్యాచారం కేసులో నేపాల్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సందీప్ లామిచానేకు ఖాట్మండు కోర్టు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధించింది. 2022లో ఖాట్మండులోని ఓ హోటల్‌లో యువతిపై అత్యాచారం కేసులో అతని పేరు వినిపించింది. అయితే బెయిల్‌పై విడుదలై చివరకు గత డిసెంబర్‌లో కోర్టు దోషిగా నిర్ధారించింది. బుధవారం శిక్షను ప్రకటించారు.

### అయోధ్య రాముడికి సమర్పించేందుకు

## 2,100 కిలోల గంట.. 108 అడుగుల అగరుబత్తి



అయోధ్యలో నిర్మించిన భవ్యమందిరంలో కొలువుదీరబోతున్న బాల రాముడికి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి అరుదైన కానుకలు వెల్లువెత్తుతున్నాయి. 108 అడుగుల పొడవైన అగరుబత్తి, 2,100 కిలోల బరువైన గంట, 1,100 కిలోల బరువైన భారీ ప్రమిద, బంగారు పాదుకలు, 10 అడుగుల ఎత్తయిన తాళం, తాళంచెవి, ఒకేసారి ఎనిమిది దేశాల సమయాన్ని సూచించే గడియారం తదితర ప్రత్యేక కానుకలను అయోధ్య రాముడికి సమర్పించేందుకు భక్తులు ఇప్పటికే సిద్ధమయ్యారు. ఈ నెల 22వ తేదీన రామ మందిరంలో రాముడి విగ్రహాన్ని ప్రతిష్టించబోతున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దేశ విదేశాల నుంచి బహుమతులు అందుతున్నాయి. సీతమ్మ పుట్టిన ఊరు జనక్‌పూర్ ప్రస్తుతం నేపాల్‌లో ఉంది. నేపాల్ నుంచి అయోధ్యకు వెండి చెప్పులు, బంగారు ఆభరణాల వంటి 3,000కుపైగా బహుమతులు వచ్చాయి. ఇక శ్రీలంకలోని అశోక్ వాటిక నుంచి తీసుకొచ్చిన ఒక అరుదైన రాయిని అక్కడి ప్రతినిధులు అయోధ్యలో అందజేశారు.

### 7,000 కిలోల 'రామ్ హల్వా'

అయోధ్యలో ప్రాణప్రతిష్ట కోసం గుజరాత్ భక్తులు 44 అడుగుల పొడవైన ఇత్తడి జెండా స్తంభాన్ని పంపిస్తున్నారు. మహారాష్ట్రకు విష్ణు మనోహర్ అనే వంట మాస్టర్ 7,000 కిలోల 'రామ్ హల్వా' తయారు చేసి అయోధ్యలో భక్తులకు పంపిణీ చేస్తారు. శ్రీకృష్ణ జన్మస్థాన్ సేవా సంస్థాన్ 200 కిలోల భారీ లడ్డూ తయారీలో నిమగ్నమైంది. అయోధ్యకు లక్ష లడ్డూలు పంపిస్తామని తిరుమతి తిరుపతి దేవస్థానం(టీటీడీ) ప్రకటించడం తెలిసిందే. సీతమ్మ కోసం సూరత్‌లో ప్రత్యేకంగా చీర తయారు చేస్తున్నారు. సూరత్‌కు చెందిన ఓ వజ్రాల వ్యాపారి 2 కిలోల వెండి, 5,000 అమెరికన్ వజ్రాలతో కూడిన నెక్లెస్ రాముడికి బహూకరించబోతున్నారు.



## అన్ని వేరియంట్లకూ ఒకే టీకా?

### ఐఐఎస్సీ ఘనత

కర్ణాటకలోని బెంగళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) సైంటిస్టులు వినూత్నమైన కోవిడ్-19 వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు. సార్స్-కోవ్-2కు చెందిన అన్ని రకాల సబ్ వేరియంట్లను ఇది సమర్థంగా ఎదుర్కొంటోందని చెబుతున్నారు. భవిష్యత్తులో పుట్టుకొచ్చే వేరియంట్లపైనా పోరాడగలదని అంటున్నారు. కాగా, ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ నేతృత్వంలో ఐఐఎస్సీ మాలిక్యులర్ బయోఫిజిక్స్ యూనిట్ బృందం తయారు చేసిన ఈ టీకాకు ఆర్ఎస్2 అని పేరుపెట్టారు. కోవిడ్-19పై జరుగుతున్న పోరాటంలో ఈ వ్యాక్సిన్ ఒక విప్లవాత్మకమైన ముందడుగు అని సైంటిస్టులు అభివర్ణించారు. ఇది వేడిని తట్టుకోగలదని, చల్లని ప్రదేశంలో నిల్వ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. కరోనా వైరస్‌కు చెందిన స్పైక్ ప్రొటీన్లలోని రెండు కాంపోనెంట్ల సమ్మేళంతో ఆర్ఎస్2 టీకాను అభివృద్ధి చేశారు. ఇదొక సింథటిక్ యాంటీజెన్. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కరోనా టీకాలతో పోలిస్తే ఆర్ఎస్ఈ టీకా మరింత ఎక్కువ రక్షణ ఇస్తుందని ఐఐఎస్సీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఇందులోని ఎస్2 అని సబ్ యూనిట్ వైరస్ మ్యుటేషన్లను సమర్థంగా తట్టుకుంటుందని పేర్కొన్నారు.



### ఇవాళ ఢిల్లీకి

## సీఎం రేవంత్, భట్టి

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పయనమయ్యారు. ఇవాళ మధ్యాహ్నం ఏఐసీసీ కార్యాలయంలో లోక్ సభ ఎన్నికల కోఆర్డినేటర్ల సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రేవంత్, భట్టి పాల్గొనున్నారు. అలాగే ఈ సమావేశంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి మున్షీ, పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్లుగా మంత్రులు పాల్గొననున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరగనుంది. 17 పార్లమెంట్ స్థానాల్లో ఇప్పటికే సునీల్ కనుగోలు టీం సర్వేలు చేస్తోంది. కనీసం 15 పార్లమెంట్ స్థానాలు గెలవాలని కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది.




## ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానాలకు తాజాగా నోటిఫికేషన్ విడుదల అయ్యింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్‌ను అసెంబ్లీ కార్యాలయం విడుదల చేసింది. కాగా, రెండు సీట్లకూ విడివిడిగానే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అసెంబ్లీ కార్యాలయం వేర్వేరుగానే నోటిఫికేషన్లను జారీ చేసింది. నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని అందులో పేర్కొంది. ఈ నెల 18 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 19న నామినేషన్ల పరిశీలన, 22 వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈ నెల 29న పోలింగ్ జరగనుంది. అదే రోజున ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. దీంతో వారు తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు.

# కొత్త టీఎస్‌పీఎస్సీకి లైన్‌క్లియర్

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కు కొత్తగా చైర్మన్, సభ్యుల నియామకానికి మార్గం సుగమమైంది. సర్కారీ కొలువుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు ఉపశమనం లభించనుంది. దాదాపు నెలరోజులుగా పెండింగ్‌లో ఉన్న చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, సభ్యుల రాజీనామాలకు గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ బుధవారం ఆమోదం తెలిపారు. టీఎస్‌పీఎస్సీలో చైర్మన్‌తో పాటు 10 సభ్యులుంటారు. కానీ గత ప్రభుత్వం చైర్మన్, ఆరుగురు సభ్యులను మాత్రమే నియమించింది. వీరిలో ఒక సభ్యుడు పదవీ విరమణ పొందగా..ఐదుగురు కొనసాగుతూ వచ్చారు. అయితే ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం, కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో చైర్మన్ బి.జనార్దన్ రెడ్డి, సభ్యులు ఆర్.సత్యనారాయణ, ప్రొఫెసర్ బండి లింగారెడ్డి, కె.రవీందర్ రెడ్డి రాజీనామాలు సమర్పించారు. మిగతా ఇద్దరు సభ్యులు కోట్ల అరుణకుమారి, సుమిత్రా ఆనంద్ తనోబా రాజీనామా చేయలేదు. కొత్తగా కమిషన్‌ను ఏర్పాటు చేయాలంటే అప్పటివరకు ఉన్న కమిషన్ పదవీ కాలం పూర్తి కావడమో లేక రాజీనామాలు చేస్తే వాటిని ఆమోదించడమో జరగాలి. కానీ చైర్మన్, ముగ్గురు సభ్యులు సమర్పించిన రాజీనామా లేఖలపై గవర్నర్ వెంటనే నిర్ణయం తీసుకోకుండా కొంతకాలం పెండింగ్‌లో పెట్టారు. తాజాగా ఆమోదం లభించడంతో కొత్త కమిషన్ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభు త్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. రాజీనామాలు చేసిన చైర్మన్, ముగ్గురు సభ్యుల స్థానంలో కొత్తవారిని నియమించడంతో పాటు ఎప్పట్నుంచో ఖాళీ గా ఉన్న 4 స్థానాలు, అలాగే పదవీ విరమణ చేసిన సభ్యుడి స్థానాన్ని ప్రభుత్వం భర్తీ చేసే అవకా శం ఉందని తెలుస్తోంది. తద్వారా టీఎస్‌పీఎస్సీ కార్యకలాపాలు పునఃప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అయితే రాజీనామాలు సమర్పించని



ఇద్దరు సభ్యుల విషయంలో ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్తుందనేది ఆసక్తికరంగా మారింది.

### పరీక్షలు, ఫలితాలు పెండింగ్‌లోనే..

వాస్తవానికి రాజీనామాలను గవర్నర్ ఆమోదించిన మరుక్షణమే టీఎస్‌పీఎస్సీకి కొత్త చైర్మన్, సభ్యులను నియమిస్తామని డిసెంబర్ 27న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం నియామకాలు చేపడ్తామని, నిరుద్యోగులెవరూ ఆందోళనకు గురికావద్దని అన్నారు. తాజాగా మార్గం సుగమం అయిన నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లోనే నియామక ప్రక్రియ చేపట్టే అవకాశాలున్నాయని అంటున్నారు. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ పరిధిలో దాదాపుగా అన్ని కార్యకలాపాలు నిలిచిపోయాయి. కొత్తగా ఉద్యోగ ప్రకటనల జారీ, ఇప్పటికే నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ఫలితాల ప్రకటన, ఇదివరకు జారీ చేసిన నోటిఫికేషన్లకు సంబంధించి పరీక్షల నిర్వహణ తదితర అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలతో పాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ తదితర ఉద్యోగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించలేదు. ఈ ఉద్యోగాలకు ప్రకటనలు జారీ అయ్యి ఏడాది గడుస్తోంది. పలుమార్లు పరీక్ష తేదీలు వెల్లడించి చివరి నిమిషంలో వాయిదా వేయడంతో అభ్యర్థుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. మరోవైపు నిర్వహించిన పరీక్షలకు సంబంధించి ఫలితాలను వెల్లడించలేదు. వివిధ కేటగిరీల్లో దాదాపు 20 వేలకు పైగా ఉద్యోగాలకు సంబంధించిన ఖాళీల భర్తీకి పరీక్షలు నిర్వహించినా ప్రక్రియ ముందుకు సాగలేదు. అలాగే కొత్తగా ఉద్యోగ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు వేయడంలేదు. ఇవన్నీ ముందుకు సాగాలంటే చైర్మన్, ఇతర సభ్యుల నియామకం అత్యంత అవసరం. కాగా టీఎస్‌పీఎస్సీ నియామకాలకు సంబంధించి సీఎస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేసినట్లు సమాచారం.

## ఇంటి నుంచే ఆర్టీసీ కార్గో పార్శిళ్ల బుకింగ్

ఏపీఎస్ఆర్టీసీలో ప్రస్తుతం ఉన్న కార్గోలో ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో పార్శిళ్లు, కవర్లు బుక్ చేసుకునే సదుపాయాన్ని బుధవారం నుంచి ప్రారంభించినట్లు ఎండీ సీహెచ్.ద్వారకాతిరుమలరావు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా తొలుత విజయవాడలో మొదలుపెట్టామని, త్వరలో రాష్ట్రం అంతటా ఈ సేవలు తీసుకొస్తామన్నారు. apsrtclogistics.in వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటే.. కార్గో సిబ్బంది వచ్చి కవర్, పార్శిల్ తీసుకెళ్తారని పేర్కొన్నారు. బుధవారం ఆయన విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కవర్ లేదా పార్శిల్‌కు పికప్ ఛార్జీలు ఉంటాయని చెప్పారు. పార్శిల్ తీసుకెళ్లేందుకు వచ్చే వ్యక్తితో ప్యాకింగ్ చేయించుకుంటే దానికి అదనపు ఛార్జీ ఉంటుందన్నారు. ఒకసారి పికప్ చేసుకునే వ్యక్తి ఇంటికొచ్చాక బుకింగ్ రద్దు చేసుకున్నా పికప్ ఛార్జీ మినహాయించుకుంటామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అనేది విధానపరమైన నిర్ణయమని, దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదన్నారు. సంక్రాంతికి హైదరాబాద్ నుంచి ఏపీకి నడిపే ప్రత్యేక సర్వీసులకు అదనంగా వెయ్యి బస్సులు పెంచినట్లు తెలిపారు.






## ప్రజాస్వామ్యమే గెలిచింది

### మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గమే అసలైన శివసేన రాజకీయ పార్టీ అని రాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నర్వేకర్ తేల్చేశారు. ఈ తీర్పుపై స్పందించిన సీఎం ఏక్‌నాథ్ షిండే.. శివ సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యం మరోసారి విజయం సాధించిందని అన్నారు. శివ సేన- బీజేపీ సంకీర్ణ కూటమి అభ్యర్థులకు ఓటు వేసిన లక్షల మంది ఓటర్లు గెలుపొందారని తెలిపారు. "రాష్ట్రంలోని శివసైనికులందరికీ హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. నేడు ప్రజాస్వామ్యం మరోసారి గెలిచింది. 2019లో శివసేన-బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేసిన లక్షలాది మంది ఓటర్లు ఈరోజు విజయం సాధించారు. ఇది శివుడి విజయం. హిందూ హృదయ చక్రవర్తి బాలాసాహెబ్ థాక్రే భావాజాలంతో ఉన్న శివసైనికుల విక్టరీ ఇది." అని ఏక్‌నాథ్ షిండే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. "బాలాసాహెబ్, ధర్మవీర్ ఆనంద్ దిఘేల హిందుత్వ భావాజాలానికి మేమే నిజమైన వారసులమని మరోసారి రుజువైంది. నేటి విజయం సత్యం విజయం. సత్యమేవ జయతే." అని అన్నారు. "నేటి ఫలితం ఏ పార్టీ విజయం కాదు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య విజయం. ప్రజాస్వామ్యంలో మెజారిటీనే ముఖ్యం. శివ సేనాను ఎలక్షన్ కమిషన్ మనకు కేటాయించింది. ఇప్పుడు విల్లు, బాణాలు కూడా మన చేతికి వచ్చాయి. నేటి ఫలితాల నుంచి నియంతృత్వం, రాజవంశం అంతమైంది." "పార్టీని తన ఆస్తిగా భావించి ఎవరూ తన మనసుకు అనుగుణంగా నిర్ణయం తీసుకోలేరు. ప్రస్తుత తీర్పు పార్టీ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తి కాదని పేర్కొంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలను కూడా ప్రజాస్వామ్యబద్ధంగా నడపాలి. పార్టీ అధ్యక్షుడు ఏకపక్షంగా ఉండకూడదు. ఈ తీర్పు అందుకు ఉదాహరణగా ఉంది.' అని షిండే ట్వీట్ చేశారు.



## బీజేపీకి బిగ్ షాక్..
# విక్రమ్ గౌడ్ రాజీనామా

పార్లమెంట్ ఎన్నికల ముందు తెలంగాణలో బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. ముకేష్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ తాజాగా బీజేపీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ కోసం ఏమీ ఆశించకుండా పనిచేసినా గుర్తింపు ఇవ్వడం లేదంటూ విక్రమ్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. కాగా, లోక్‌సభ ఎన్నికలకు వ్యూహాలు రచిస్తున్న వేళ బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. కాషాయ పార్టీకి విక్రమ్ గౌడ్ రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ హైకమాండ్‌కు ఆయన లేఖ రాశారు. ఇక, లేఖలో..'పార్టీలో కొత్త వారిని అంటరానివారిగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణకు మారు పేరు అంటూ పెద్ద నాయకులు కొట్టుకుంటుంటే కొందరు చోద్యం చూస్తున్నారు. పార్టీ బలోపేతం కోసం ఏమీ ఆశించకుండా పని చేసినా గుర్తింపు ఇవ్వడం లేదు. ప్రజా బలం లేనివారికి పెద్దపీట వేసి వారి కింద పనిచేయాలని చెబుతున్నారు. ఎన్నికల తర్వాత ఓటమికి, నేతల అసంతృప్తిపై ఎవరూ బాధ్యత తీసుకోలేదు. ఆవేదనతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు' తెలిపారు. ఇదిలా ఉండగా.. విక్రమ్ గౌడ్ త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉన్నట్టు సమాచారం.



## సూర్య హాలీవుడ్ లెవెల్ లుక్ వైరల్..

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య హీరోగా ఇప్పుడు తన కెరీర్ లో 42వ సినిమాని దర్శకుడు శివ కాంబినేషన్లో చేస్తున్న భారీ చిత్రం “కంగువ” కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ భారీ చిత్రం సూర్య కెరీర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో తెరకెక్కిస్తుండగా ఈ సినిమా కోసం సూర్య ఒక పవర్ ఫుల్ ట్రాన్స్ ఫ్ర్మేషన్ లోకి కూడా మారాడు. మరి ఈ భారీ చిత్రం నుంచి సూర్య అయితే లేటెస్ట్ గా ఓ సాలిడ్ అప్డేట్ ని అందించాడు. ఈ సినిమాలో తన పార్ట్ వరకు షూటింగ్ ని కంప్లీట్ చేసుకున్నాను అని ఒక స్టన్నింగ్ ఫోటో పెట్టి తెలిపాడు. మరి ఇందులో అయితే సూర్యని చూస్తే ఏదో హాలీవుడ్ క్యారక్టర్ ని చూస్తున్న ఫీల్ కలుగుతుంది. ఒక అగ్రెసివ్ లుక్ హాలీవుడ్ ప్రిడేటర్ లా కనిపిస్తున్నాడు. దీనితో ఈ పిక్ ఇపుడు ఫ్యాన్స్ లో వైరల్ గా మారింది. ఇక ఈ భారీ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా యూవీ క్రియేషన్స్ మరియు గ్రీన్ స్టూడియోస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

# ఎవరీ జస్టిస్ బీవీ నాగరత్న?



బిల్కిస్ బానో రేపిస్టులను మళ్లీ జైలుకు పంపిన ఎస్సీ జడ్జి బీవీ నాగరత్న ఎవరు అనేది చర్చనీయాంశంగా మారింది. 11 మంది దోషులను ముందస్తుగా విడుదల చేసిన రిమిషన్ ఉత్తర్వులను రద్దు చేసిన సుప్రీం న్యాయమూర్తి బీవీ నాగరత్న దోషులు రెండు వారాల్లో లొంగిపోవాలంటూ ఆదేశాలిచ్చి సంచలనం రేపారు. 1962 అక్టోబర్ 30న జన్మించిన జస్టిస్ బెంగుళూరు వెంకటరామయ్య నాగరత్న ప్రస్తుత సుప్రీంకోర్టు న్యాయమూర్తి. గతంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు.దివంగత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య కుమార్తె.కర్ణాటకకు చెందిన తొలి సుప్రీం న్యాయమూర్తి కూడా. మాండ్య జిల్లా, ఎంగలగుప్పె చత్ర గ్రామానికి చెందిన నాగరత్న న్యూఢిల్లీలోని భారతీయ విద్యాభవన్‌లో విద్యను అభ్యసించారు.1984లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని జీసస్ అండ్ మేరీ కళాశాల నుండి BA హిస్టరీ పట్టా తీసుకున్నారు. 1987లో న్యాయ పట్టా పొందారు.

### న్యాయవాద వృత్తి

జస్టిస్ నాగరత్న అక్టోబర్ 28, 1987న కర్ణాటక బార్ కౌన్సిల్‌లో చేరి న్యాయవాద వృత్తిన చేపట్టారు. రాజ్యాంగ, వాణిజ్య, బీమా, సేవ, పరిపాలనా మరియు ప్రజా చట్టం, భూమి మరియు అద్దె చట్టాలు, కుటుంబ చట్టం మరియు మధ్యవర్తిత్వంలో నిపుణత సాధించారు. ఫిబ్రవరి 18, 2008న కర్ణాటక హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగాను, ఫిబ్రవరి 17, 2010న శాశ్వత న్యాయమూర్తిగాను నియమితులయ్యారు. అనంతరం 2021 ఆగస్టులో భారత సుప్రీంకోర్టుకు నియమితులయ్యారు. జస్టిస్ నాగరత్న 2027, సెప్టెంబరులో కేవలం 36 రోజుల వ్యవధిలో భారత తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి (CJI) కావాల్సి ఉంది.

### కీలక తీర్పులు

కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి పలు కీలక తీర్పులను వెలువరించిన నాగరత్నం 2012లో ఎలక్ట్రానిక్ మీడియాను నియంత్రించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రసార మాధ్యమాలను నియంత్రించేందుకు స్వయం ప్రతిపత్తి, చట్టబద్ధమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరిన ఆమెకే దక్కింది.

నోట్ల రుద్దు చట్ట విరుద్ధం: ఇక సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, నోట్ల రద్దుపై ఆమె అభిప్రాయాలు ఇప్పటి వరకు ఆమె ఇచ్చిన అత్యంత ప్రముఖమైనదిగా పేరొంది. 2016 నవంబరు నాటి నోట్ల రద్దు నిర్ణయంపై, సుప్రీంకోర్టు బెంచ్‌లోని ఇతర నలుగురు న్యాయమూర్తులు డీమానిటైజేషన్ సమర్థించగా మెజారిటీ అభిప్రాయానికి భిన్నంగా జస్టిస్ నాగరత్న అది సదుద్దేశంతో కూడుకున్నదే కానీ చట్టవిరుద్ధని అభిప్రాయపడ్డారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కేవలం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేయడం కంటే దానిని అమలు చేయడానికి శాసన ప్రక్రియను అనుసరించాల్సి ఉందని చెప్పారు. 2019 తీర్పులో, జస్టిస్ నాగరత్న దేవాలయం వాణిజ్య సంస్థ కాదంటూ మరోసాహసోపేత తీర్పును వెలువరించారు. దాని ఉద్యోగులు గ్రాట్యుటీ చెల్లింపు చట్టం ప్రకారం గ్రాట్యుటీకి అర్హులు కాదని, అయితే కర్ణాటక హిందూ మతపరమైన సంస్థలు మరియు స్వచ్ఛంద సేవా చట్టం ప్రకారం ఇలాంటి ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొంది. కర్నాటక హైకోర్టులో 2021లో పోక్సో చట్టంపై ఇచ్చిన తీర్పు గురించి కూడా ప్రధానంగా చెప్పుకోవాలి. ఈ చట్టంలోని సెక్షన్ 35లో పేర్కొన్న ఆదేశాన్ని పూర్తి కాని పక్షంలో నిందితులకు బెయిల్‌పై హక్కు ఉండదని జస్టిస్‌లు బీవీ నాగరత్న, ఎంజి ఉమతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. అంటే కేసును మొదట గుర్తించినప్పటి నుండి ఒక సంవత్సరంలోపు విచారణను ముగించాలి. పిల్లల ప్రమేయం ఉన్నట్లయితే, నేరాన్ని అంగీకరించిన 30 రోజులలోపు కోర్టు వారి సాక్ష్యాలను నమోదు చేయాలి. ఏవైనా జాప్యాలు జరిగితే వాటిని వ్రాతపూర్వకంగా రికార్డు చేయాలని కూడా స్పష్టం చేశారు.

### బిల్కిస్ బానో కేసు

2002 లో జరిగిన గుజరాత్ అల్లర్లలో సమయంలో బిల్కిస్ బానోపై ఇంట్లోకి చొరబడిన పలువురు దుండగులు సామూహిక అత్యాచారం చేశారన్న ఆరోపణలు నమోదైనాయి. ఐదు నెలల గర్భిణిగా ఉన్న బానో మూడేళ్ల కూతురితో పాటు ఇంట్లో అందరినీ దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఈ కేసులో మొత్తం పదకొండు మంది దోషులకు కోర్టు మరణ శిక్ష విధించింది. ఆ తరువాత ఈ తీర్పుపై నిందితులు అప్పీల్ చేసుకోవడంతో యావజ్జీవ శిక్షగా మారింది. అయితే గత ఏడాది స్వాతంత్ర దినోత్సవం రోజున సత్ ప్రవర్తన, 14 ఏళ్లు శిక్ష పూర్తి చేసుకున్నారంటూ క్షమాభిక్షపేరుతో విడుదల చేసింది. దీంతో దిగ్భ్రాంతికి గురైన బిల్కిస్ బానో తిరిగి సుప్రీను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గతేడాది అక్టోబర్ లో తీర్పును రిజర్వ్ చేశారు. ఈక్రమంలో జస్టిస్ నాగరత్న గుజరాత్ ప్రభుత్వం వైఖరిని తప్పుబట్టారు. దోషుల క్షమాభిక్షను రద్దు చేశారు.

## ఓటిటిలో వచ్చేసిన “కోటబొమ్మాళి పిఎస్”

సీనియర్ హీరో శ్రీకాంత్ ప్రధాన పాత్రలో యంగ్ నటీనటులు శివాత్మిక రాజశేఖర్ మరియు రాహుల్ విజయ్ లు నటించిన ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ అండ్ ఎమోషనల్ డ్రామా “కోటబొమ్మాళి పిఎస్”. మరి ఈ చిత్రం మలయాళ సూపర్ హిట్ చిత్రం “నాయట్టు” కి రీమేక్ గా దర్శకుడు తేజ మార్ని తెరకెక్కించగా థియేటర్స్ లో రిలీజ్ అయ్యిన ఈ చిత్రంలో తెలుగులో కూడా సాలిడ్ వసూళ్లు అందుకొని మంచి హిట్ అయ్యింది. అలాగే వినూత్న ప్రమోషన్స్ నడుమ రిలీజ్ కి వచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటిటిలో అయితే స్ట్రీమింగ్ కి వచ్చేసింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు తెలుగు స్ట్రీమింగ్ యాప్ ఆహా వారు కొనుగోలు చేయగా అందులో ఈరోజు నుంచి అయితే ఈ సినిమా వచ్చేసింది. మరి అప్పుడు మిస్ అయ్యి ఇప్పుడు చూడాలి అనుకునేవారు ఈ ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ ని వీక్షించవచ్చు. ఇక ఈ చిత్రానికి రంజన్ రాజ్ సంగీతం అందించగా గీతా ఆర్ట్స్ 2 వారు నిర్మాణం వహించారు.






## పారిశ్రామిక అభివృద్ధిపై రేవంత్ సర్కార్ ప్రత్యేక దృష్టి..
### 13 దేశాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం

హైదరాబాద్ లోని కుతుబ్ షాహీ టూంబ్ వద్ద బుధవారం రాత్రి 13 దేశాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆతిథ్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జయేష్ రంజన్, హైదరాబాద్ రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ స్నేహజ, ఇతర అధికారులు పాల్గొన్నారు. అమెరికా, ఇరాన్, తుర్కియే, యూఏఈ, యూకే, జపాన్, థాయిలాండ్, జర్మనీ, శ్రీలంక , బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఫిన్లాండ్ దేశాల ప్రతినిధులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలుకుతూ తమ ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. అభయహస్తం కింద అన్ని వర్గాల అభ్యున్నతికి నూతనంగా ఏర్పాటు అయిన తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర సమర యోధులు మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ తదితర నేతల ఆశయాలను, మాజీ ప్రధాని ఇందిరా గాంధీని స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, పారదర్శకత్వంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఆరు హామీలతో సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవిస్తుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. యువత భవిష్యత్తుకు, పారిశ్రామిక అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయా దేశాలకు విజ్ఞప్తి చేశారు.



## “పుష్ప” సెట్స్ లో సుకుమార్ తో బన్నీ

మన టాలీవుడ్ సినిమా దగ్గర ఉన్నటువంటి కొన్ని వెరీ స్పెషల్ కాంబినేషన్ లలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు దర్శకుడు సుకుమార్ ల కాంబినేషన్ కూడా ఒకటి. వీరి నుంచి వచ్చిన “ఆర్య” మొదలుకొని ఇప్పుడు పుష్ప వరకు కూడా ఒకొకటి భారీ సక్సెస్ అయ్యాయి. మరి ఇప్పుడు దర్శకుడు సుకుమార్ బర్త్ డే రావడంతో చిత్ర యూనిట్ అంతా కూడా తనకి శుభాకాంక్షలు తెలియజేస్తుండగా అల్లు అర్జున్ కూడా తన నుంచి సోషల్ మీడియాలో విషెస్ తెలియజేసాడు. మరి తాను పుష్ప సెట్స్ లో సుకుమార్ తో కూర్చొని మాట్లాడుతున్న ఒక హ్యాపీ మూమెంట్ అయితే బన్నీ షేర్ చేసుకోగా నా జీనియస్ సుక్కు డార్లింగ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాని అని తెలిపాడు.





# సూర్య నెక్స్ట్‌లో అదితి శంకర్?

కోలీవుడ్ సినిమా స్టార్ హీరో సూర్య శివకుమార్ హీరోగా ఇపుడు భారీ చిత్రం “కంగువ” చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రంని దర్శకుడు శివ తెరకెక్కిస్తుండగా భారీ అంచనాలు దీనిపై నెలకొన్నాయి. ఇక ఈ సినిమా తర్వాత సూర్య తన కెరీర్ 43వ చిత్రాన్ని టాలెంటెడ్ దర్శకురాలు సుధా కొంగరతో అనౌన్స్ చేయగా దీనిపై కూడా సాలిడ్ హైప్ నెలకొంది. మరి ఈ సినిమాలో అయితే ఓ యంగ్ హీరోయిన్ ఎంపిక అయ్యినట్టుగా టాక్ వినిపిస్తుంది. మరి ఆమె ఎవరో కాదు పాన్ ఇండియా దర్శకుడు శంకర్ కూతురు అదితి శంకర్ అట. మరి ఈమె గత ఏడాదిలోనే శివ కార్తికేయన్ చిత్రం “మహా వీరుడు” లో నటించి మెప్పించింది. ఇప్పుడు హీరో సూర్య సినిమాలో అయితే ఆమె ఎంపిక అయ్యినట్టుగా కోలీవుడ్ వర్గాలు చెప్తున్నాయి. మరి నిజం అయితే ఆమె కెరీర్ కి మంచి ప్లస్ అవుతుంది అని చెప్పాలి. ఇక దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది.

# మణిపూర్‌లో మళ్లీ కాల్పులు



మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లాలో మళ్లీ కాల్పులు జరిగాయి. కాల్పులు జరిగిన ప్రాంతానికి సమీపంలో అల్లం కోయడానికి వెళ్లిన నలుగురు వ్యక్తులు అదృశ్యమయ్యారు. బిష్ణుపూర్ జిల్లాలోని కుంబి, తౌబల్ జిల్లాలోని వాంగూ మధ్య కాల్పుల ఘటన జరిగింది. గల్లంతైన నలుగురిని ఓయినమ్ రోమెన్ మైతేయి (45), అహంతేమ్ దారా మైతేయి (56), తౌడమ్ ఇబోమ్చా మైతేయి (53), తౌడం ఆనంద్ మైతేయి (27)గా గుర్తించారు. ఘటన తర్వాత కుంబి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. కాల్పులు జరగడానికి ముందు ఆరు రౌండ్ల మోర్టార్ కాల్పులు జరిగాయని స్థానిక నివేదికలు తెలిపాయి. అంతకుముందు జనవరి 1న, తౌబల్స్ లిలాంగ్ ప్రాంతంలో గుర్తుతెలియని సాయుధ దుండగులు, స్థానికుల మధ్య ఘర్షణలు చెలరేగింది. ఈ ఘర్షణల్లో నలుగురు మరణించారు. మరుసటి రోజే గస్తీలో ఉన్న సాయుధ బలగాలపై దుండగులు కాల్పులు జరిపారు. మణిపూర్‌లో గత ఏడాది మేలో మెయిటీ, కుకీ తెగల మధ్య ఘర్షణలు చెలరేగాయి. అప్పటి నుంచి అడపాదడపా హింసాత్మక సంఘటనలు నమోదవుతున్నాయి. ఇప్పటివరకు 180 మంది ప్రాణాలు కోల్పోయారు.

## అమెజాన్ నుంచి 500 మంది ఉద్యోగులు ఔట్..




అమెజాన్ లైవ్ స్ట్రీమింగ్ ఫ్లాట్ ఫారమ్ Twitch 500 మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధంగా ఉందని తాజా నివేదికలు చెపుతున్నాయి. కంపెనీ ఉద్యోగుల్లో 35 శాతం మందిని తొలంగించనున్నట్లు తెలుస్తోంది. ఇవాళో రేపు ఈ లేఆఫ్ ప్రకటన చేసే అవకాశం ఉంది. ఫైనాన్షియల్ ఇబ్బందులతో 2023లో 400 మంది ఎంప్లాయిస్ ని అమెజాన్ Twitch తొలగించింది. అమెజాన్ ఆధ్వర్యంలో నడుస్తున్న లైవ్ స్ట్రీమింగ్ ఫ్లాట్ ఫారమ్ Twitch ..తొమ్మిదేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా కాలంగా నష్టాల్లో సాగుతోంది. 1.8 బిలియన్ గంటల లైవ్ కంటెంట్ కు కలిగి ఉన్న ఈ ఫ్లాట్ ఫారమ్ నిర్వహణ భారం అయిందని అధికారులు గుర్తించారు. ఆర్థిక నష్టాలను పరిష్కరించేందుకు ఆన్ లైన్ స్ట్రీమింగ్ పరిశ్రమలో వేగంగా మార్పులు చోటు చేసుకున్నాయి. దీనికి అనుగుణంగా కంపెనీ ఉద్యోగుల తొలగింపులు చేపడుతోందని తాజా నివేదికలు చెపుతున్నాయి. కొన్ని దేశాల్లో కార్యాలయాలు మూసివేశారు కూడా. సంస్థ అంతర్గత నిర్మాణం, ప్రస్తుత మార్కెట్ తో పోటీ పడేందేకు అమెజాన్ Twitch చర్యల్లో భాగంగానే లేఅఫ్స్ చేపట్టిందని రిపోర్ట్స్ చెబుతున్నాయి.